నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 25 ఏప్రిల్ 2024 | VIKARABAD


# చేవెళ్ల లోక్‌సభ స్థానానికి ఒక్క రోజే 20 నామినేషన్లు



**రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక**

షాబాద్, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గానికి బుధవారం 20 నామినేషన్లు దాఖలు అయ్యాయని రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన స్వతంత్ర అభ్యర్థి జి. మల్లేశ్‌గౌడ్ 2వ, 3వ సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారన్నారు. సోషల్ జస్టిస్ పార్టీ అభ్యర్థి ఫణి ప్రసాద్ కటకం 2వ సెట్, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ప్రతిపాదకుడు తోక అంజన్‌కుమార్ రెండో సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మర్క సతీశ్ సాగర్ 2వ సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారని తెలిపారు. వీరితో పాటు బహుజన్ ముక్తీ పార్టీ అభ్యర్థిగా పి.గోవింద్ 2 సెట్ల నామినేషన్లు సమర్పించారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ ఆలీ, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా తాహెర్ కమల్ ఖుందుమేరీ, స్వతంత్ర అభ్యర్థిగా దాసరి సాహితి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చెంచురెడ్డి పద్మావతి, స్వతంత్ర అభ్యర్థిగా ఏ. ప్రవీణ్‌కుమార్, యాంటీ కరప్షన్ డైనమిక్ పార్టీ అభ్యర్థి సుంకె సంపత్, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ ఇక్బాల్, జై స్వరాజ్ పార్టీ అభ్యర్థిగా కత్తుల యాదయ్య, దేశ్‌జనహిత్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ షకీల్, స్వతంత్ర అభ్యర్థులుగా టి. దుర్గాప్రసాద్, ఎస్. గోపాల్, ఎస్. శ్రీనివాస్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు. మొత్తం 18 మంది అభ్యర్థులు 20 నామినేషన్లు దాఖలు చేశారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఇప్పటి వరకు మొత్తం 57 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి శశాంక తెలిపారు.

### కర్ణాటక కేంద్రంగా తెలంగాణకు

# డీజిల్ స్మగ్లింగ్

**ఆరుగురి అరెస్టు..**

**రూ.10.36 లక్షల డీజిల్ స్వాధీనం**

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కేంద్రంగా తెలంగాణ రాష్ర్టానికి డీజిల్ స్మగ్లింగ్ చేస్తూ, రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్న ఒక ఘరానా ముఠా గుట్టును సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. పోలీసు అధికారుల కథనం ప్రకారం.. కర్ణాటకలో డీజిల్ ధర రూ.86.39 కాగా, తెలంగాణలో డీజిల్ ధర రూ.95.65 ఉంది. ఈ రెండు రాష్ర్టాల మధ్య డీజిల్ ధర 9 రూపాయల తేడా ఉన్నది. దీనిని ఆసరాగా చేసుకున్న రాధాకృష్ణ కర్ణాటకలో డీజిల్‌ను కొనుగోలు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని పలువురికి సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో తెలంగాణ రాష్ట్ర ఖజానాకు కోట్ల రూపాయల గండి పడుతున్నది. ఈ మేరకు సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్‌వోటీ బృందం గచ్చిబౌలి పోలీసులతో కలిసి నిఘా పెట్టారు. వట్టినాగులపల్లిలోని శ్రీదేవి ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన డీజిల్ నిల్వ కేంద్రంపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.10.36 లక్షల విలువజేసే 10,800 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నారు. అంతేకాకుండా, అక్రమంగా డీజిల్‌ను రవాణా చేస్తున్న ట్యాంకర్ల డ్రైవర్లు మహ్మద్ షానవాజ్, మహ్మద్ నిజాముద్దీన్, మహ్మద్ సయ్యద్ ఖాన్, అమ్మడపల్లి కార్తిక్, శోభన్, చింతపల్లి కామేశ్వర్‌రావులను అరెస్టు చేశారు. ప్రధాన డీజిల్ స్మగ్లర్ రాధాకృష్ణ, డోర్‌స్టెప్ డీజిల్ సర్వీసెస్ కంపెనీ యజమాని, డీజిల్ స్మగ్లర్ సూర్య అలియాస్ సాయిరాం సూర్య, డోర్ స్టెప్ డీజిల్ సర్వీసెస్ కంపెనీ సూపర్‌వైజర్ రిషి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డీజిల్‌తో పాటు రూ.35 లక్షల విలువజేసే ఏడు చిన్న ట్యాంకర్లను కూడా సీజ్ చేశారు. డీజిల్ స్మగ్లర్ రాధాకృష్ణపై గతంలో కూడా గచ్చిబౌలి తదితర ఠాణాల్లో కేసులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు.

### ఫెయిల్ అయిన విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్**

వికారాబాద్, ఏప్రిల్ 24 : ఇంటర్ పరీక్ష ఫలితాలపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఒత్తిడికి గురి కావద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ తెలిపారు. వెంటనే జరిగే సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఎంతో మంది మేధావులు ప్రాథమిక స్థాయిలో ఫెయిల్ అయి.. అధైర్య పడకుండా చదివి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. జీవితం చాలా విలువైనది అన్నారు. పరీక్షా ఫలితాల అనంతరం విద్యార్థులు ఎవరైనా ఒత్తిడికి గురైతే మీలో మానసిక స్థైర్యాన్ని నింపడానికి జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 14416 ను సంప్రదిస్తే ప్రత్యేక వైద్య నిపుణులు, కౌన్సిలర్‌లతో అవగాహన కల్పిస్తామన్నారు. యువకులకు ఎన్నో రంగాల్లో అవకాశాలు ఉంటాయని, పిల్లలను ఎప్పుడూ ఇతర విద్యార్థులతో పోల్చవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉండాలంటే సరైన నిద్ర, మంచి ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, సోషల్ మీడియాను తక్కువగా వాడటం, స్నేహితులతో గడపడం చేయాలని తెలిపారు.

# అద్వితీయం..



- 71.7 శాతంతో మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రథమ స్థానం
- 77.63 శాతంతో రెండో సంవత్సరం ఫలితాల్లో తృతీయ స్థానం
- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు
- ఉత్తీర్ణతలో బాలికలదే హవా..
- గతంలో కంటే మెరుగుపడిన ఇంటర్ ఫలితాలు

రంగారెడ్డి, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు జరుగగా.. బుధవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో జిల్లా టాప్‌లో నిలిచింది. 71.7 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 77.63 శాతం ఉత్తీర్ణతతో జిల్లా తృతీయ స్థానాన్ని దక్కించుకుంది.

**అమ్మాయిలదే హవా..**

ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలు రెండింటిలోనూ బాలికలదే హవా కొనసాగింది. మొదటి సంవత్సరం పరీక్షలకు 33,721 మంది బాలికలు హాజరవగా.. 25,879(76.74 శాతం)మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 37,576 మంది హాజరు కాగా.. 23,516 (67.18 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 30,900 మంది బాలికలు హాజరుకాగా.. 25,204 (78 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 33,859 మంది హాజరుకాగా.. 25,069(74.04 శాతం)మంది పాస్ అయ్యారు.

**ఒకేషనల్‌లోనూ బాలికలదే పైచేయి..!**

ఒకేషనల్ విభాగంలోనూ బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరంలో బాలికలు 70.75 శాతం ఉత్తీర్ణులు కాగా.. బాలురు 34.12 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలికలు 81.74 శాతం, బాలురు 43.85 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 3,580 మంది బాలబాలికలు పరీక్షలు రాయగా.. 1,819(50.81 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 3,094 మంది బాలబాలికలు పరీక్షలు రాయగా.. 1,919(62.02 శాతం) మంది ఉత్తీర్ణతను సాధించారు.

**సత్తా చాటిన ప్రభుత్వ విద్యా సంస్థలు**

ప్రభుత్వ కళాశాల విద్యార్థులతోపాటు ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ, గురుకుల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలను మించి ఫలితాలను సాధించి ఔరా అనిపించాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విస్తారంగా కళాశాలలు, గురుకులాలు ఏర్పాటు కావడంతోపాటు మార్కుల కోసం తీసుకున్న చర్యలు ఇందుకు కారణమని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు.

**రీ కౌంటింగ్‌కు మే 2 వరకు అవకాశం**

ఈ నెల 25 నుంచి మే 2 వరకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది. ఆన్‌లైన్‌లో మార్కులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

**గత ఆరేండ్లలో జిల్లాలో మొదటి సంవత్సరం ఫలితాలు ఇలా..**

| సంవత్సరం | హాజరు | ఉత్తీర్ణులు | శాతం | ర్యాంకు |
|---|---|---|---|---|
| 2018-19 | 54,598 | 38,794 | 71 | - |
| 2019-20 | 62,456 | 43,98 | 70 | 2 |
| 2020-21 | 53,619 | 32,328 | 60 | 2 |
| 2021-22 | 56,359 | 41,056 | 72 | 3 |
| 2022-23 | 68,289 | 50,433 | 73 | 2 |
| 2023-24 | 71,297 | 51,121 | 71.7 | 1 |

**గత ఆరేండ్లలో జిల్లాలో రెండో సంవత్సరం ఫలితాలు ఇలా..**

| సంవత్సరం | హాజరు | ఉత్తీర్ణులు | శాతం | ర్యాంకు |
|---|---|---|---|---|
| 2018-19 | 55,863 | 37,602 | 67 | - |
| 2019-20 | 57,638 | 41,076 | 71 | 4 |
| 2020-21 | 55,829 | 55,829 | 100 | - |
| 2021-22 | 52,265 | 39,410 | 75 | 3 |
| 2022-23 | 53,050 | 38,911 | 73 | 5 |
| 2023-24 | 64,759 | 50,273 | 77.63 | 3 |

# బాలికలదే పైచేయి..

- ఇంటర్ ఫలితాల్లో 61.42 శాతం ఉత్తీర్ణత
- గతేడాది ఇంటర్ ఫలితాల్లో 60 శాతం ఉత్తీర్ణత
- 68.25 శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు
- ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 53.11 శాతం ఉత్తీర్ణత
- 61.75 శాతం బాలికలు, 43.23 శాతం బాలురు
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు మే 2 వరకు గడువు

వికారాబాద్, ఏప్రిల్ 24, (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలకు సంబంధించి జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో బాలికలు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది జిల్లాలో 61.42 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దీంతో రాష్ట్రస్థాయిలో జిల్లా 27వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది ఇంటర్ ఫలితాల్లో 60 శాతం మేర విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది 1.42 శాతం మేర ఉత్తీర్ణత పెరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం గతేడాదితో పోలిస్తే తగ్గడం గమనార్హం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రత్యేక శ్రద్ధ వహించినప్పటికీ అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయారు. మే 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు, ఫీజు చెల్లింపునకుగాను మే 2 వరకు గడువు విధించినట్లు ఇంటర్‌బోర్డు అధికారులు వెల్లడించారు.

**61.42 శాతం ఉత్తీర్ణత..**

జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 15,506 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8,947 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 6456 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కాగా, 61.42 శాతం ఉత్తీర్ణతతో 3,965 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణులైన బాలురకు సంబంధించి 3,010 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 63.50 శాతం ఉత్తీర్ణతతో 1,643 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. బాలికలకు సంబంధించి 3,446 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా, 68.25 శాతం ఉత్తీర్ణతతో 2,352 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో జిల్లా 22వ స్థానంలో నిలువగా, 53.11 శాతం మేర విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో మొత్తం 6,455 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 3,428 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 61.75 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో ఉండగా, 43.23 శాతంతో బాలురు పూర్తి వెనుకంజలో నిలిచారు. ప్రథమ సంవత్సరంలో బాలికలు 3,443 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా, 2,126 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. 3,012 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 1,302 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఒకేషనల్ ప్రథమ సంవత్సర ఫలితాలకు సంబంధించి మొత్తం 1,353 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 52.85 శాతం ఉత్తీర్ణతతో 715 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 525 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 36.95 శాతం ఉత్తీర్ణతతో 194 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, బాలికలకు సంబంధించి 828 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా, 62.52 శాతం ఉత్తీర్ణతతో 521 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సర ఫలితాలకు సంబంధించి జిల్లాలో 1,242 మంది పరీక్షలకు హాజరు కాగా, 67.55 శాతం ఉత్తీర్ణతతో 839 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 425 బాలురు పరీక్షలకు హాజరు కాగా, 43.76 శాతం ఉత్తీర్ణతతో 186 మంది బాలురు, 817 బాలికలు పరీక్షలకు హాజరు కాగా, 79.93 శాతం ఉత్తీర్ణతతో 653 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు.





ఆమనగల్లులో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

# ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా..

**కాంగ్రెస్, బీజేపీ దొందుదొందే..**

**అన్ని వర్గాలకు సమన్యాయం చేసింది కేసీఆర్**

**నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్**

ఆమనగల్లు, ఏప్రిల్ 24 : సమాజంలో ఎంతో ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని కాదని ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మండలంలోని చింతలపల్లి., తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్, ఖానాపూర్, వెంకట్రావ్‌పేట్, గట్టుప్పలపల్లి, మెదక్‌పల్లి, రాంపూర్, చంద్రాధాన, తలకొండపల్లి, పడకల్, రావిచేడ్, మక్తమాదారం., కడ్తాల్ మండలంలోని మైసిగండి, కర్కల్‌పహాడ్, ఎక్వాయిపల్లి గ్రామాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు.

మొదటగా ఆమనగల్లులోని సంత్ సేవాలాల్ గుట్ట వద్ద సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

**ప్రశ్నించే గొంతుక పార్లమెంటులో ఉండాలి**

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆగమాగం చేసిన తెలంగాణ రాష్ట్రం పూర్వవైభవం, పునర్నిర్మాణం జరగాలంటే, కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలంటే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి ప్రశ్నించే గొంతుక పార్లమెంట్‌లో ఉండాలన్నారు.

**ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలం**

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తి వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ దీవించి పంపిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి ఉన్నత విద్యావంతుడికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని ఆయన కోరారు.

**సమాజం అభివృద్ధి చెందాలంటే ఉచిత విద్య, వైద్యం అవసరం**

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. 26 సంవత్సరాల ఉన్నతస్థాయి పోలీస్ ఉద్యోగాన్ని వదిలి ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రజల గొంతుకగా సమస్యలను పార్లమెంట్‌లో వినిపించడానికే ఎన్నికల్లో నిల్చున్నానని స్పష్టం చేశారు. ఆమనగల్లులోని కొంత మంది నాయకులు ఇక్కడి బిడ్డలను మతం అనే మత్తు మందులో ఉంచి చాలా ఘోరంగా తయారు చేస్తూ దేశానికి భారంగా మారుస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పని చేసి వేలమంది విద్యార్థుల ఉన్నత చదువులకు శ్రీకారం చుట్టి ఎంతో మంది పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలను ఉన్నతస్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దానని తెలిపారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ఉచిత విద్య, వైద్యం ఎంతో అవసరమని.. దాని కోసం సీఎం కేసీఆర్ ఎంతో పరితపించారని, సాధ్యమైనంత వరకు అమలు చేశారన్నారు. తెలంగాణ రాష్ర్టాన్ని ప్రపంచ పటంలో నిలిపేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. తనపై నమ్మకముంచి పార్లమెంట్‌లో మీ తరపున ప్రశ్నించే అవకాశం ఇవ్వాలని కోరారు. మీ అందరి గొంతుకగా పార్లమెంట్‌లో కొట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు. బీజేపీకి 400 పార్లమెంట్ సీట్లు వస్తే నరేంద్రమోదీ, అమిత్ లాంటి అగ్రనాయకులు భారత రాజ్యాంగం తీసివేస్తామని బహిరంగంగానే చెబుతున్నారని.. దీంతో రిజర్వేషన్లు, ఉద్యోగాలు మన పిల్లలకు రావని.. అలాంటి పరిస్థితి వస్తే రోడ్లపై బిచ్చమెత్తుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ఆనాటి మూతికి ముంత, నడుముకు తాటాకు కట్టుకొని బతకాల్సిన రోజులు వస్తాయన్నారు. అలాంటి బీజేపీ నాయకులు మీ గ్రామాల్లోకి వస్తే నిలదీయాలన్నారు. కాంగ్రెస్ , బీజేపీలు ఒకటేనని.. బడేబాయ్-చోటేబాయ్ అనుకుంటున్నారని., ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయవద్దని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కరువు అని మరోమారు నిరూపితమైందని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీపై పూటకో మాట మారుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి పబ్బం గడుపుతున్నారన్నారు. ఓటుకు నోటు కేసులో జైలుకు పోయిన దొంగ మన రాష్ట్ర సీఎం కావడం మన దురదృష్టమన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలపై నిలదీయాలని కోరారు. ఎన్నో మెడికల్ కళాశాలు, గురుకులాలు, ప్రాజెక్టులు కట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, జడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, వైస్ ఎంపీపీలు ఆనంద్, శంకర్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎల్‌ఎన్ రెడ్డి, ఎంపీటీసీలు కుమార్, వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అర్జున్‌రావు, జైపాల్‌రెడ్డి, శంకర్, విజయ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వీరయ్య, శ్రీనివాస్‌యాదవ్, చందు, నాయకులు సుభాష్, అల్లాజీ, ప్రసాద్, వెంకటేశ్, సతీష్, రమేశ్ నాయక్, భాస్కర్, మహేశ్, మహేందర్, రాజు ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు